ప్రజాశక్తి

బుధవారం 28 ఆగస్టు 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

కౌలురైతు గోడు పట్టని ప్రభుత్వం

అరకొరగా గుర్తింపు కార్డులు - 40 శాతం వరకూ ఈ-క్రాప్ నమోదు పెండింగ్

ప్రజాశక్తి-తెనాలి

ఆరుగాలం శ్రమించి నష్టపోతున్న కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వారికి గుర్తింపు కార్డులు జారీలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. నామమాత్రంగా గుర్తింపు కార్డులు జారీ చేసి చేతులు దులుపుకుంటోంది. ఫలితంగా రైతులకు బ్యాంకు రుణాల లభ్యత లేదు. పెట్టుబడులకు అప్పులు చేసి నానా అవస్థలు పడుతున్నారు. ఇక ఈ-క్రాప్ నమోదూ అంతంత మాత్రంగానే ఉంది.

తెనాలి మండలం ఎరుకలపూడి ప్రాంతంలో వరి

ఖరీఫ్ సాగులో రైతులు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఆదిలోనే భారీ వర్షాల కారణంగా వెద పెట్టిన వరి కొంత మేర నష్టపోయినా, మళ్లీ వెదపద్ధతిలోనే వరిసాగు చేపట్టారు. వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం మండలంలో ఖరీఫ్‌లో 15,300 ఎకరాలు సాగులో ఉంది. దీనిలో 15 వేల ఎకరాలకు పైబడి వరి సాగుచేస్తుండగా, 200 ఎకరాలకు పైగా మినుము సాగు చేస్తున్నారు. వరి 30-35 రోజుల దశలో ఉంది. మినుము సాగు ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. సాగులో దాదాపు 80 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. వారంతా భూమికి ముందస్తు కౌలు చెల్లించాల్సిందే. దాదాపు ఎకరానికి రూ.25 వేల వరకూ కౌలు ఉంది. విత్తనాల మొదలు ఎరువులు, పురుగు మందులు, కోత, నూర్పిడి వంటి ఖర్చులు వెరసి ఎకరానికి దాదాపు రూ.50 వేల వరకు ఖర్చవుతోంది.

అరకొరగా కౌలు రైతు గుర్తింపు కార్డులు

కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందిస్తే పంట రుణాలు, విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రాయితీ, పంట నష్టం సంభవించినపుడు పరిహారం లభిస్తుంది. ఇదే విషయాన్ని అధికారులూ పలు సమావేశాలు, సదస్సుల్లో చెబుతుంటారు. అయితే గుర్తింపు కార్డుల జారీలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో నామమాత్రంగా కొందరికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి, సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. గుర్తింపు కార్డులు ఇచ్చిన కొద్ది మందికైనా బ్యాంకు రుణాలు ఇప్పించటంలో సంబంధిత అధికారులు చొరవ చూపటంలేదు.

పూర్తవ్వని ఈ-క్రాప్ నమోదు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు రైతులు, కౌలు రైతులకు పరిహారం చెల్లించాలంటే ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. అయితే ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు అధికారుల గణాంకాల ప్రకారం ▶ 2లో

రేషన్ దుకాణం కోసం వేధింపులు

మనస్థాపంతో యువతి అదృశ్యం - సూసైడ్ నోట్ - సాగర్ కెనాల్ వద్ద ఆనవాళ్ల ఆధారంతో పోలీసుల గాలింపు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రేషన్ దుకాణం కోసం వేధిస్తున్నారని యువతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని జూలకల్లులో మంగళవారం వెలుగు చూసింది. నాగార్జున సాగర్ కెనాల్ వద్ద మనీషాకు చెందిన చెప్పులు, చున్నీతోపాటు సూసైడ్ నోట్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. పట్టణ సిఐ వెంకట్రావు అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. మనీషా కుటుంబీకుల వివరాల ప్రకారం.. మండలంలోని జూలకల్లుకు చెందిన ఎల్.మనీషా (18) తండ్రి రాముడు 18 ఏళ్లుగా రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు. 6 నెలల క్రితం ఆయన చనిపోవడంతో తల్లి, మరో ముగ్గురో సోదరుల సాయంతో దుకాణాన్ని మనీషా నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ దుకాణాన్ని తమకు అప్పగించాలని ఆమె పెదన్నాన పేరయ్య, అతని కుమారుడు వెంకటేశ్వర్లు తరచూ ఒత్తిడి చేస్తున్నారు. 15 రోజుల క్రితం వీరిద్దరూ మరికొంతమందితో కలిసి మనీషా ఇంటిపైకి దాడికొచ్చారు. మనీషాను కొట్టడంతోపాటు అసభ్యంగా దూషించారు. ఇప్పటికే తండ్రిని కోల్పోయిన తమ కుటుంబం రేషన్ ▶ 2లో



సూసైడ్ నోట్‌లో ఒక భాగం.. అదృశ్యమైన యువతి మనీషా (ఇన్‌సెట్)

హత్యాచారం కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - నాదెండ్ల

ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి నాదెండ్ల మండలం, గణపవరం గ్రామం, పీర్లచావిడికి చెందిన షేక్ మస్తాన్‌బి లైంగిక దాడికి గురై ఆపై హత్య చేయబడింది. ఈ ఘటనలో ముద్దాయిలు ఒడిశా రాష్ట్రం, భద్రక్ జిల్లా, ఫతేపూర్, లెంతార గ్రామానికి చెందిన మనోజ్ మాలిక్, ఆనంద మాలిక్‌ను, మండలానికి గణపవరానికి చెందిన ఎం.సాంబశివరావును అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు చిలకలూరిపేట రూరల్ సిఐ బి.సుబ్బానాయుడు పేర్కొన్నారు.

మా టీచర్‌ను బదిలీ చేయొద్దు

ప్రజాశక్తి-తాడేపల్లి

తమ ఉపాధ్యాయురాలిని బదిలీ చేయరాదని, ఇక్కడే కొనసాగించాలని తాడేపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ప్లకార్డులు పట్టుకుని రోడ్డెక్కారు. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్థానిక జడ్‌పి పాఠశాలలో సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించే డి.పద్మజను వేరే పాఠశాలకు ఇటీవల బదిలీ చేశారు. దీంతో పదో తరగతి విద్యార్థులు పాఠశాల నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆ ఉపాధ్యాయురాలు ఉంటేనే తాము పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. గంటకు పైగా మండుటెండలో విద్యార్థుల నిరసన కొనసాగింది.

ఎఎస్‌పికి బుద్ధా వెంకన్న ఫిర్యాదు

తమపై దాడిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మొదటి ముద్దాయిగా చేర్చాలని డిమాండ్ - 2 లో

లింగాయపాలెం వద్ద నర్సరీ దుస్థితి

రాజధాని అమరావతిలో నర్సరీలను పునరుద్ధరిస్తారా?

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతిలో నర్సరీల పునరుద్ధరణ ఎప్పుడని స్థానికులు నిరీక్షిస్తున్నారు. తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 29 గ్రామాలతో రాజధాని నిర్మించాలని రాష్ట్ర విభజన అనంతరం అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. మూడు మండలాల్లో సుమారు 33,400 ఎకరాలను ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ స్కీం ద్వారా రైతుల నుంచి సమీకరించింది. దీంతో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యవసాయ కూలీల జీవనం ప్రశ్నార్థకమైంది. కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఇందుకనుగుణంగా ప్రభుత్వం వ్యవసాయంపై ఆధారపడ్డ వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల ▶ 2లో

అశ్రు నివాళి

మరణం : 14-08-2024

కీ॥శే॥ యార్లగడ్డ శ్రీలక్ష్మి గారు

ఆదర్శ గృహిణిగా, అభిమాన పాత్రురాలిగా, వృత్తిధర్మాన్ని, కుటుంబ ధర్మాన్ని పాటిస్తూ...
అందరి అభిమానాలు అందుకుని మాకు తోడు నీడై, విలువైన సలహాలతో అనునిత్యం
కుటుంబానికి తోడుగా వున్న నీవు మా నుంచి దూరమైనను
నీ మధురస్మృతులు మా మదిలో పదిలం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
అశ్రు నయనాలతో...

భర్త : యార్లగడ్డ లెనిన్‌కుమార్

కుమారుడు : యార్లగడ్డ అజయ్‌చంద్ర

మరియు యార్లగడ్డ ఫ్యామిలీ

పెద్దకర్మ : 28- 8- 2024 బుధవారంనాడు వినుకొండలోని నర్సరావుపేటరోడ్డులో గల జయకృష్ణ టవర్స్ నందు జరుగునని తెలియజేయుచున్నాము.

కౌలురైతు గోడు పట్టని ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

60 శాతమే పూర్తయ్యింది. మిగిలిని 40 శాతం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. ఖరీఫ్‌లో వరిపైరు 30 నుంచి 35 రోజుల దశలో ఉండగా ఇంకా ఈ-క్రాప్ పూర్తి కాకపోవటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా గుర్తింపు కార్డుల జారీ

ములకా శివసాంబిరెడ్డి, రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు

డెల్టా ప్రాంతంలో భూములను సాగు చేసేది 80 శాతానికి పైగా కౌలు రైతులే. వారు ప్రతి ఏటా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల పూర్తిస్థాయిలో పంపిణీ చేయడంల ఏదు. ఏదో కొద్ది మందికి నామమాత్రంగా కార్డులు ఇస్తున్నారు. వారికైనా బ్యాంకు రుణాలు ఇప్పించే ప్రయత్నం అధికారులు చేయటం లేదు. ఫలితంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులకు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారు.

3 వేల మందికి గుర్తింపు కార్డులు జారీ

జి.ప్రేమ్‌సాగర్, మండల వ్యవసాయాధికారి, తెనాలి

మండలంలో 15 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో వరి, 200 ఎకరాల్లో మినుము సాగులో ఉన్నాయి. వరిలో తెల్లపొడ, ఎర్ర బారటం కనిపిస్తోంది. ఐరన్, జింక్ లోపానికి ఇవి సూచనలు. రైతులకు పిచికారిపై అవగాహన కల్పిస్తున్నాం. కౌలురైతు గుర్తింపు కార్డులు దాదాపు 3వేల మందికి ఇచ్చాం. కౌలు రైతుల సంఖ్య కచ్చితంగా చెప్పలేం. ఈ-క్రాప్ నమోదు 60 శాతం పూర్తయ్యింది. రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి.

రేషన్ దుకాణం కోసం వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

డీలర్‌షిప్‌నూ వదులుకుంటే జీవనం కష్టమవుతుందని, పైగా ఇప్పటి వరకూ గౌరవంగా బతికిన తమపై దాడి చేసి అవమానించారని మనీషా తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఇదే విషయాన్ని సూసైడ్ నోట్‌లోనూ పేర్కొన్నారు. పరువు కోసం ప్రాణాలను అర్పిస్తున్నాని, తన చావుకు వెంకటేశ్వర్లు, అతని తండ్రి పిచ్చయ్య కారణమని లేఖలు రాసి మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుండి వెళ్లిపోయి ఆత్మహత్యాయత్నం చేశారు. దీనిపై కుటుంబీకుల ఫిర్యాదుతోపాటు సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సిఐ వెంకట్రావు తెలిపారు. మనీషా కోసం గాలింపు కొనసాగుతుందన్నారు.

టిడిపి ఆకృత్యాలకు ఇదే నిదర్శనం : కాసు మహేష్‌రెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి ఆకృత్యాలు, దాడులకు తెగబడుతోందని, ఇందుకు నిదర్శనమే దళిత యువతి ఆత్మహత్యాయత్నమని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. మనీషా రేషన్ దుకాణం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు ఆ దుకాణాన్ని టిడిపి వాళ్లు లాక్కున్నారని, పైగా రూ.70-80 వేలు ఇవ్వాలంటూ ఒత్తిడి పెట్టారని పేర్కొన్నారు. వారి వేధింపులు తట్టుకోలేకే యువతి ఇలా చేసి ఉంటారని, తాను బాధిత కుటుంబాన్ని బుధవారం కలుస్తానని తెలిపారు.

వ్యాధుల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - చేబ్రోలు : వ్యాధులపై నివా రణ కోసం స్థానిక సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సుచరిత మాట్లాడుతూ చేతు పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. నీటినిల్వల లేకుండా చూసుకోవాలని, దోమలను నిర్మూలించాలని చెప్పారు. ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ కె సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎఎస్‌పికి బుద్ధా వెంకన్న ఫిర్యాదు

తమపై దాడిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మొదటి ముద్దాయిగా చేర్చాలని డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి నాయకులు, సానుభూతిపరులపై దాడులకు పాల్పడిన వారికి వైసిపి నేతలు పదవులు కట్టబెట్టి రౌడీ రాజ్యాన్ని తలపించేలా వ్యవహరించారని టిడిపి నేత బుద్ధా వెంకన్న విమర్శించారు. 2020లో మాచర్ల పర్యటనకు వెళ్లిన తాను, బొండా ఉమాపై దాడికి పాల్పడిన తురకా కిషోర్‌కు అప్పట్లో మున్సిపల్ చైర్మన్ పదవిని కట్టబెట్టారని అన్నారు. నాటి మాచర్ల దాడిలో పాల్గొన్న వారిపై పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ లక్ష్మీపతిని బుద్ధా వెంకన్న మంగళవారం కలిసి ఫిర్యాద చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను, బోండా ఉమ మాచర్లకు వెళ్లామని, ఆ సందర్భంలో పిన్నెల్లి సోదరులు వారి అనుచరులు అకారణంగా దాడి చేశారని చెప్పారు. ఇనుప రాడ్లు, రాళ్లతో దాడికి పాల్పడిన తురకా కిషోర్‌కు మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టారని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమను చంపడానికి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పథకం పన్నారని, ఆయన్ను మొదటి ముద్దాయిగా చేర్చాలని చెప్పారు. దీనిపై తాను ఆధారాలు సహా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పిన్నెల్లి సోదరులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని మాచర్లను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని అనుచరుడు తురకా కిషోర్‌పై వేగంగా దర్యాప్తుతోపాటు అరెస్టు చేయాలన్నారు.

ఎఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న బుద్ధా వెంకన్న

ఇసుక ఆన్‌లైన్ విధానంపై జెసి పరిశీలన

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉచిత ఇసుక 2024 ఆన్లైన్ విధానాన్ని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. అనంతరం కొన్ని సూచనలు చేశారు. తుళ్ళూరు - గుంటూరు రహదారిలో ఇసుక లారీలను ఉంచకుండా చూడాలని, ట్రాఫిక్‌కి ఆటంకం లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. క్యూ లైన్ పద్ధతిలో ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ చేసుకోవాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ ఇసుక బుకింగ్ చేసుకున్న వెంటనే చెల్లించాలన్నారు. తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు, తుళ్ళూరు తహశీల్దారు కార్యాలయాలతో పాటు గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయములోనూ ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ చేసుకునే సదుపాయం ఉందని పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గ కేంద్రంలో ఉన్న తహశీల్దారు కార్యాలయంలోనూ ఇసుక బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పిస్తామన్నారు.

తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయంలో ఉచిత ఇసుక ఆన్లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న జెసి

అర్హులకు టిడ్కో గృహాలు అందజేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడ్కో గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన సత్తెనపల్లి పట్టణంలోని టిడ్కోగృహ సముదాయంలో విద్యుద్దీకరణ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహాలు 80శాతం పనులు అయ్యాయని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో కాలంలో జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందని విమర్శించారు. గోదావరి పెన్నానదుల అనుసంధానం ప్రాజెక్టును వైసిపి ప్రభుత్వం గాలికి వదిలేయటంతో యంత్ర పరికరాలు తుప్పు పుట్టాయన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. టిడ్కో గహాసముదాయాలకు వేసిన రంగులు మార్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చౌట శ్రీనివాసరావు , ఆతుకూరి నాగేశ్వరరావు ,హరి మున్సిపల్ కమిషనర్ కె షమీ టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో అడ్వాన్స్ కేన్సర్ డయాగ్నోసిస్ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించే టెక్నాలజీ త్వరలో భారత్ లో అందుబాటులోకి రానుందని మంగళగిరి ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జరిగిన జాతీయ స్థాయి ట్రెండ్స్ ఇన్ ఎపిజెనిక్స్ ఇన్ క్యాన్సర్ డయాగ్నోసిస్ మరియు థెరఫి అనే పేరుతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయి క్యాన్సర్ డయాగ్నోసిస్ , థెరఫి గురించి వివరించారు. వర్శిటీ ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం.జానకిరామయ్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించడానికి ధేశ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బయోటెక్నాలజీతో కత్రిమ మేథస్సును అనుసంధానం చేయడం ద్వారా రక్తంలో క్యాన్సర్ కణాలను ముందుగానే గుర్తించి క్యాన్సర్ రోగుల ప్రాణాలను కాపాడేందుకు భారత్ లో శాస్త్రవేత్తలు స్వదేశీ పరిజ్ఞానంతో నూతన టెక్నాలజీకి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. కచ్చితత్వంతో క్యాన్సర్ కణాలను ఎలా చంపాలి.., ?క్రిస్పరు కాస్ నైన్ సాంకేతికతతో ఉత్పత్తి చేయబడిన ఎలుకలను క్యాన్సర్ ప్రయోగాలకు ఎలా ఉపయోగించాలి అనే అంశాల గురించి ఆయన బయోటెక్నాలజీ , వైద్య విద్యార్థులకు విపులంగా వివరించారు.

నాగేశ్వరరావుకు ఎన్టీఆర్ సాహితీ సేవా పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

విజయవాడ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం జరిగిన మదర్ థెరిస్సా సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాల్లో తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు ఎన్టీఆర్ జాతీయ సాహితీ సేవా పురస్కారం ప్రదానం చేశారు. హర్షిత డెవలపర్స్ జనరల్ మేనేజర్ సంపత్ కుమార్, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ దాసు, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.చక్రవర్తి, సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె.బుల్లిబాబు నుండి పురస్కారం అందుకున్నారు.

నర్సరీలను పునరుద్ధరిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

కల్పనకు ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది.

రాజధానిలోని అనంతవరం, అబ్బరాజుపాలెం, రాయపూడి, లింగాయపాలెం, వెలగపూడి, వెంకటపాలెం తదితర గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటయ్యాయి. కూలీలకు పనులు కల్పిస్తామని అటవీశాఖ అధికారులు చెప్పడంతో ప్రభుత్వం నర్సరీలకు భూములు కేటాయించింది. దీంతో నర్సరీల్లో కూలీలకు పని దొరికినట్లయ్యింది. రాష్ట్రంలోని కడియం తదితర ప్రాంతాల నుంచి రకరకాల పూల చెట్లు, నర్సరీలకు వచ్చాయి. వాటితో పాటు అనేక రకాల విత్తనాలను చల్లి వాటిని సంరక్షించే పనులను నర్సరీల్లో చేసేవారు. ఆకర్షణీయమైన మొక్కలను రాజధానిలోని సెక్రటేరియట్, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్లు పక్కన నాటడంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. కొంతకాలం పాటు సజావుగా సాగిన నర్సరీల నిర్వహణ క్రమేపీ మందగించింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయి వైసిపి అధికార పగ్గాలు చేపట్టాక నర్సరీల మనుగడే ప్రశ్నార్థకమైంది. వెంకటపాలెం మినహా మిగిలిన చోట్ల నర్సరీలు మూతబడ్డాయి. కొన్నిచోట్ల మొక్కలు మానులయ్యాయి. చెట్ల మధ్య బోర్డులు మాత్రం కనిపిస్తున్నాయి. నర్సరీలు లేకపోవడంతో కూలీలకు దొరికే కొద్దిపాటి పనులు కూడా లేకుండాపోయాయి. వ్యవసాయ పనులు లేక ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు మృగ్యమై కూలీల జీవనం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికీ కొంతమంది కూలి పనులు కోసం తాడికొండ, అమరావతి మండలాల్లోని గ్రామాలకు వెళుతున్నారు. పత్తి తీతలు, మిర్చికోతలు లాంటి పనులకు ట్రాక్టర్లు, ఆటోలలో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నర్సరీల ఏర్పాటు అంశం ముందుకొచ్చింది. గత ఆదివారం మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, ఎడిసి చైర్ పర్సన్ లక్ష్మీ పార్ధ సారధి రాజధానిలోని వెంకటపాలెం నర్సరీని పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రాజధాని అమరావతిని పర్యాటక రాజధానిగా నిర్మిస్తామని, హైదరాబాద్‌ను పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన అధికారి లక్ష్మీ పార్థసారథికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివృద్ధి బాధ్యతను అప్పగించామని చెప్పారు. అమరావతిని హరితవనంగా తీర్చి దిద్దడానికి నర్సరీలు దోహదపడతాయని, ప్రభుత్వం నర్సరీల పునరుద్ధరణ ద్వారా తమకూ కొంతమేర ఉపాధి దొరుకుతుందని కూలీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

రోడ్డు ప్రమాదంలో వెల్డింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ పంచాయతీ పరిధిలోని మురళీనగర్ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రామకృష్ణపురానికి చెందిన మంతెన గోపాలరావు(53) మృతి చెందాడు. వెల్డింగ్ షాపులో పని చేసేందుకు వస్తున్న గోపాలరావును గుంటూరు నుండి సత్తెనపల్లి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడిని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా

మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుమారుడు రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో బైపాస్ రహదారి పనులు పూర్తి

ప్రజాశక్తి–చిలకలూరిపేట

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా, అభివృద్ధికి ఊతంగా తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి నవంబర్‌లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలో గల బొప్పూడి వద్ద బైపాస్ రహదారి నిర్మాణ పనులను జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం చెన్నై నుంచి కోల్‌కతా వెళ్లే 16వ నెంబర్ జాతీయ రహదారిపై రామచంద్రాపురం నుంచి ఎడ్లపాడు వరకు నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రామచంద్రపురం నుంచి తిమ్మాపురం వరకు 16.384 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి ఏర్పాటు చేస్తున్నారు. ఈ మార్గంలో మూడు చోట్ల పైవంతెనలూ నిర్మిస్తున్నారు. బైపాస్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఆరులైన్ల రహదారి ఏర్పాటుతో పాటు రామచంద్రాపురం నుంచి తిమ్మాపురం వరకు ఎడమ వైపు సర్వీసు రహదారి, ఆ పక్కన సైడ్ డ్రైన్, గోడ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రమాదాల నివారణకు టిడిపి గత ప్రభుత్వ హయాంలోనే తాను మంత్రి ఉండగా ఈ బైపాస్ నిర్మాణం ప్రారంభం చామని తెలిపారు. జాతీయ రహదారి ఉన్నప్పుడు మళ్లీ బైపాస్ ఇవ్వకూడదని దేశవ్యాప్తంగా ఒక చట్టం చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం 2014–19 మధ్య ఆనాడు రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శ్యాంబాబు కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఇక్కడ బైపాస్ తీసుకొచ్చామని వివరించారు. రహదారికి సంబంధించి చేసిన భూసేకరణలో 25శాతం కాంట్రిబ్యూషన్ రాష్ట్ర ప్రభుత్వమే భరించే తొలి ప్రాజెక్టు దేశంలో ఇదేనని అన్నారు. జాతీయరహదారుల సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి ఉమ్మడిగా ఒక ఖాతా తెరిచి రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లించారని, అందులో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని తెలిపారు. ఈ నవంబరులో బైపాస్ రహదారిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ప్రారంభించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. పట్టణంలో రహదారుల పైకి నీరు రాకుండా ఉండేందుకు ఓగేరు నుంచి కుప్పగంజి వాగులోకి డ్రైన్లు ప్రవహించేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారి నిర్మాణ సంస్థ ఉద్యోగులు టిడిపి నాయకులు పాల్గొన్నారు

పోలేరమ్మ అమ్మవారి జాతర

ప్రజాశక్తి మంగళగిరి

ఏపీ ఎరుకల సేవా సంఘం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలోమంగళవారం నాంచారమ్మ చెరువు వద్ద, పోలేరమ్మ అమ్మవారి జాతర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరం ఏడుకొండలు, జిల్లా కార్యదర్శి పాలపర్తి మోజేష్, తోకల రాము, ఉయ్యాల కోటేశ్వరరావు, కలవకొల్లు కోటేశ్వరరావు, నల్లగొండ తాతారావు, జగన్నాధం ఫిరోజ్, బొడ్డు నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	56,464
మిర్చి ఎగుమతి	:	53,075
మిర్చి నిల్వ	:	18,202

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 16,500
నెం.5	8,500 - 13,000
273	9,000 - 11,800
341	9,000 - 16,500
నాన్ ఎసి	
తేజ	7,500 - 18,300
బడిగి	8,000 - 13,500
దేవనూరు డీలక్స్	9,000- 11,500
తాలుకాయలు	4,500 - 12,000
ఎసి	
334	9,000 -16,500
నెం.5	9,000 - 9,000
273	11,500 - 11,500
341	8,800 - 14,000
తేజ	9,500 - 18,500
బడిగి	9,500 - 13,500
దేవనూరు డీలక్స్	13,000- 14,000
తాలుకాయలు	5,000 - 11,500

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

కొరిటిపాడు బ్రాంచి : హరిహర మహల్ ఎదురుగా, కొరిటిపాడు, గుంటూరు - 522007

NOTICE UNDER SECTION 13 (2) OF ACT 54 OF 2002 FOR ENFORCEMENT OF SECURITY INTEREST

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత (లు) : మిస్ వెలగా మేఘన (ఋణగ్రహీత & తనఖాదారు), తండ్రి : వెలగా నాగేశ్వరరావు, 4–4–136/3–1, శ్రీ రంజిత రెసిడెన్సీ, 7/2, చంద్రమౌళీనగర్, గుంటూరు, ఎపి – 522007. శ్రీ వెలగా నాగేశ్వరరావు (ఋణగ్రహీత) తండ్రి : సీతారామయ్య, 4–4–136/3–1, శ్రీ రంజిత రెసిడెన్సీ, 7/2, చంద్రమౌళీనగర్, గుంటూరు, ఎపి – 522007. మిస్ వెలగా శిల్ప (కో–ఆబ్లిగెంట్/హామీదారు), తండ్రి : వెలగా నాగేశ్వరరావు, 4–4–136/3–1, శ్రీ రంజిత రెసిడెన్సీ, 7/2, చంద్రమౌళీనగర్, గుంటూరు, ఎపి – 522007.

ఫెసిలిటీ రకం	ఎన్.పి.ఎ. తేది : 13-08-2024 నాటికి బకాయి మొత్తం	14-7-2024- 17-8-2024 వరకు వర్తించని వడ్డీ	పీనల్ వడ్డీ (సింపుల్)	ది. 17-08-2024 నాటికి బకాయి మొత్తం
ELGEN - EDUCATION LOANS (160830100008504)	Rs. 10,17,667.14/-	Rs. 11,165.00	Rs. 433.00	Rs. 10,29,265.14/-

ప్రాధమిక హామీ : షెడ్యూల్ : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్, గోరంట్ల గ్రామ పంచాయితీ ఏరియా, గోరంట్ల గ్రామం, డి.నెం. 11/1ఎ, 11/1బి, 11/1సి1, 11/1సి2 వద్ద ప్లాట్ నెం. 232కి చెందిన ఎకరా 3.36 సెంట్లు విస్తీర్ణంలోని ఆస్తి. హద్దులు : తూర్పు : ప్లాట్ నెం. 268 – 33.6 అ॥, పడమర : 40 అ॥ వెడల్పు రోడ్డు – 33.6 అ॥, ఉత్తరం : ప్లాట్ నెం. 233 – 54 అ॥, దక్షిణం : ప్లాట్ నెం. 231 – 54 అ॥. పై సరిహద్దుల మధ్య 201 చ॥గ॥లు లేదా 168.06 చ॥మీ॥ల విస్తీర్ణంలోని ఖాళీ ఇంటి స్థలము. సేల్ డీడ్ నెం. 7649/2000, తేది : 20–08–2000

అమ్మా / అయ్యా,

విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు – మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి – నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు అనగా చిరునామాలోని నెం. 1కి చెందిన వారు ఇ.ఎల్.జి.ఇ.ఎన్ లోన్ క్రింద మా కొరిటిపాడు బ్రాంచి, గుంటూరు వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమై నందున మీ ఖాతాను ది. 13–08–2024 న నిరర్ధక ఆస్తిగా (NPA) వర్గీకరించ బడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుపబడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించ వలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 17–08–2024 సం/– ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. 660/2022
ఇన్
ఓ.ఎస్. 296/2019

మోదాల అల్లూరమ్మ ..... పిటీషనర్/వాది
వర్సెస్
1.జిలగ గాంధీ చనిపోయినందున వారసులు
2. కల్లం దేవ కృపారాణి
అలియాస్ జిలగ దేవకృపారాణి
మరియు ఇద్దరు ఇతరులు .... రెస్పాండెంట్స్

టు,
ఆర్–2.
కల్లం దేవకృపారాణి అలియాస్ జిలగ దేవ కృపారాణి, భర్త: లేట్ జిలగ గాంధీ
ఆర్–3.
జిలగ చైతన్య గాంధీ తండ్రి: లేట్ జిలగ గాంధీ
ఆర్–4.
జిలగ రాహుల్, తండ్రి: లేట్ జిలగ గాంధీ
అందరి నివాసం: డోర్ నెం: 24–36–100,
4వ వార్డు, నల్లచెరువు, గుంటూరు టౌన్ అండ్ గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాను జిలగ గాంధీ గారిపైన బాకీ రాబట్టు నిమిత్తం దావా వేయగా, దావా పెండింగ్‌లో ఉండగానే జిలగ గాంధీ మరణించినారు. వారి వారసులైన మిమ్ములను దావాలో చేర్చామని ఐ.ఎ. 660/2022 ఇన్ ఓ.ఎస్. 296/2019 పిటీషన్‌ను దాఖలు చేయగా, మీకు నోటీసులు ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటనకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు తేదీ: 10–09–2024 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 10–09–2024 ఇ.శారద
మార్కాపురం అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ. 662/2022
ఇన్
ఓ.ఎస్. 296/2019

మోదాల అల్లూరమ్మ .... పిటీషనర్/వాది
వర్సెస్
1.జిలగ గాంధీ చనిపోయినందున వారసులు
2. కల్లం దేవ కృపారాణి
అలియాస్ జిలగ దేవకృపారాణి
మరియు ఇద్దరు ఇతరులు .... రెస్పాండెంట్స్

టు,
కల్లం దేవకృపారాణి
అలియాస్ జిలగ దేవ కృపారాణి,
భర్త: లేట్ జిలగ గాంధీ
నివాసం: డోర్ నెం: 24–36–100,
4వ వార్డు, నల్లచెరువు, గుంటూరు టౌన్ అండ్ గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాను జిలగ గాంధీ గారిపైన బాకీ రాబట్టు నిమిత్తం దావా వేయగా, దావా పెండింగ్‌లో ఉండగానే జిలగ గాంధీ, నిన్ను నీ కుమారులు ఇద్దరు (మైనర్లు) వారసులుగా చేసి మరణించినారు. నీ ఇద్దరు కుమారులు మైనర్లు అయినందున మైనర్ గార్డియన్‌గా నిన్ను నియమించమని పై పిటీషను దాఖలు చేయడం జరిగింది. కానీ నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసిననూ ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు తేదీ: 10–09–2024 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో స్వయముగా లేదా వకీలు ద్వారా హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 10–09–2024 ఇ.శారద
మార్కాపురం అడ్వకేట్, మార్కాపురం.

దస్తావేజులు పోయినవి

నీలి సుజాత భర్త : నీలి సృజన్, డోర్ నెం. 14–4–41, భావనగర్ కాలనీ,1వ వార్డు, పొన్నూరు కాపురస్తులు, పొన్నూరు మున్సిపల్ ఏరియాలో చేరిన పొన్నూరు గ్రామ డి.నెం. 256–2రు య. 2–44 శెంట్లలోని య. 0–66 శెంట్ల శేరి మాగాణి భూమి పొన్నూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో డాక్యుమెంట్ నెం. 3627/2009 రిజిష్టర్ కాబడిన దస్తావేజులు ది. 20–8–2014వ తేదీన పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో జిరాక్స్ తీసుకొని ఆటోలో వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. తిరిగి వెతికినా దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

నీలి సుజాత,
సెల్ : 9440264647

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
బాపట్ల
ఒ.యస్. నెం.2/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పొన్నూరు
రిప్రజెంటెడ్ బై చీఫ్ మేనేజర్ ..... వాది
మరియు
యం./ఎస్. రిజోఇస్ ఐరన్ సెంట్రింగ్ సప్లయిస్,
ప్రో. బై శ్రీమతి. కునుకుంట్ల సుకన్య
కే/ఆఫ్. కునుకుంట్ల రామయ్య, రెసిడెంట్ ఆఫ్.
7–6–6, లూథరన్ చర్చి లైన్, నిడుబ్రోలు–522 124
పొన్నూరు మండలం, గుంటూరు డిస్ట్రిక్ట్. ఆంధ్రప్రదేశ్
పొన్నూరు జె.సి.జె.సి. ....ప్రతివాది

పై నెంబరున, పై కోర్టులో వాది మీ పై దావా దాఖలు చేసుకొనగా, మీరు దావా సమను తీసుకొ నక జాప్యం చేయుచున్నందున శ్రీ కోర్టువారు బహిరంగ ప్రకటన ద్వారా సమన్లు ఉత్తర్వు జారీచేసి మీరు హాజరు అగుటకు ది.02–09–2024 వాయిదా వేసినారు. సదరు తేదిన ఉదయం గం.10.30 ని॥ల కు మీరు సదరు కోర్టువారి యెదుట హాజరై స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఏమైన ఆక్షేపణ లు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి, నిర్ణయించెదరని ఇంద మూలముగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేది: 02–09–2024

పి.జయరాజు
వాది తరపున న్యాయవాది,
పొన్నూరు, పొన్నూరు మండలం,
గుంటూరు జిల్లా

కోర్టు నోటీసు
మహారాజశ్రీ మంగళగిరి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

బిట్వీన్:
సింహాద్రి కోటేశ్వరమ్మ ...పిటీషనర్/ ప్రతివాది
మరియు
సింహాద్రి ఆదిలక్ష్మి ....రెస్పాండెంట్ / వాది

టు,
సింహాద్రి ఆదిలక్ష్మి, భర్త. లేటు చెన్నారెడ్డి, రావెల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది దాఖలు చేసిన I.A.No. 950/2022 పిటీషన్ ది.20–02– 2024 శ్రీ కోర్టువారు డీఫాల్ట్ క్రింద డిస్మిస్ చేసినందున, సదరు పిటీషన్‌ను రెస్టోరేషన్ కోరుచూ ప్రతివాది I.A. No. 206/2024 గా దాఖలు చేసి, సదరు పిటీషన్ లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించిననూ, మీరు తీసుకొనక కాలయాపన చేసినందున శ్రీ కోర్టు వారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డర్ వేయగా, సదరు ఆర్డర్ ప్రకారము మీరు ది. 30–09–2024 తేదీన ఉదయం 10.30గం.లకు పై తెల్పిన కోర్టునకు మీరు స్వయంగా గానీ, మీ అడ్వకేటు ద్వారా గానీ, హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొన వలెను. లేని యెడల మీ పరోక్ష మందు విచారించి,తీర్మానించబడునని తెలియపరచడ మైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది. 30–09–2024
కె.వి. శ్రీరామ సుబ్బారావు,
పి. బీబీజాన్,
పిటీషనర్ / ప్రతివాది తరపు అడ్వకేట్స్
అరండల్ పేట, గుంటూరు.
సెల్: 98491 87315

Notice
IN THE COURT OF THE II ADDL.DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.No:220 / 2023

Between:
Palavai Teja being minor rep.by his father palavai Ramanjineyulu ..... Petitioner
And
Akbar and Others .... Respondents

To,
R1: Akbar, S/o. Ramju, R/o. H.No.235, Andhaki, Mewat, Singar, Haryana-122508, (Driver of the Lorry bearing No.HR 38 AD 2739)

పై నెంబరు O.P లోని పిటీషనర్ యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P. లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు నోటీసులు పంపించినను ముట్టనందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని ది:10–09–2024 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10–30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:10–09–2024

కె.రామకృష్ణా రెడ్డి,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు.

గూడ్స్‌షెడ్‌ను పరిశీలించిన ఎంపీ

ప్రజాశక్తి - నాదెండ్ల : మండలంలోని సాతులూరు రైల్వేస్టేషన్ పరిధిలో ఇటీవల నిర్మించిన రైల్వే గూడ్స్ షెడ్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంగళవారం పరిశీలించారు. ఎరువుల లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవసరమైన సాంకేతిక అనుమతులు సత్వరమే వచ్చేలా చూడాలని సీనియర్ డివిజనల్ మేనేజర్‌ను కోరగా వచ్చేనెల 10వ తేదీ నాటికి అందుబాటులోకి తెస్తామని సమాధానమిచ్చారు. ఆథరైజేషన్ లెటర్ ద్వారా సాతులూరు గూడ్స్ షెడ్‌కు ఎరువుల సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద అనుమతులు తీసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళీని ఆదేశించారు. రైల్వే గూడ్స్ షెడ్‌కు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలనూ ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో ఎడిఎలు రవికుమార్, పి.మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బి.సత్యనారాయణ, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యడ్లపాడు : జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రమైన యడ్లపాడులోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్, జెవివి చిలకలూరిపేట డివిజన్ అధ్యక్షులు చెరుకూరి సృజన మాట్లాడుతూ గతేడాది చెకుముకి రాష్ట్ర స్థాయి సంబరాలకు తమ పాఠశాల ఆతిథ్యం ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఈ ఏడాది పాఠశాల స్థాయి సంబరాలు సెప్టెంబర్ 25వ తేదీన, మండలస్థాయి అక్టోబర్ 1న, జిల్లాస్థాయి సంబరాలు అమరావతిలో అక్టోబర్ 27న, రాష్ట్ర స్థాయి సంబరాలు విశాఖపట్నంలో నవంబర్ 9, 10 తేదీల్లో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జెవివి పల్నాడు జిల్లా అధ్యక్షులు డి.బుజ్జిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల విధులు ఉపాధ్యాయులకు వద్దు

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పాఠశాలలో మరుగుదొడ్ల ఫొటోలు బాధ్యత నుండి ఉపాధ్యాయులు మినహాయించాలనే ఉత్తర్వులను అమలు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. దీనిపై పోరాట ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా ఇంకా సరిగా అమలు కావడం లేదన్నారు. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల నుండి మూడున్నర గంటల మధ్య పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి హెచ్‌ఎం అప్లోడ్ చేయాలని చెప్పారని, ఎస్‌ఎంసి సభ్యులు సచివాలయ సిబ్బంది ఫొటో తీయకుంటే హెచ్‌ఎం బాధ్యత వహించాలని చెప్పారని అన్నారు. మరుగుదొడ్ల ఫొటోలు బాధ్యత తగ్గించినా మరింత భారాన్ని మోపుతూ ఉత్తర్వులిచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.మోహన్‌రావు, టి.అరుణ్‌కుమార్, కె.తిరుపతిస్వామి, వై.శ్రీనివాసరావు, బిక్షమయ్య, సాయి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బిల్లు ఉన్న వాహనాలకే స్టాక్ పాయింట్ వద్ద అనుమతి

ఇసుక కొరత లేదు - మాదిపాడు వద్ద పల్నాడు కలెక్టర్, ఎస్పీ పరిశీలన

స్టాక్ పాయింట్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అచ్చంపేట మండలం మాదిపాడు వద్ద గల ఇసుక స్టాక్ పాయింట్‌ను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్ వద్ద పరిశీలన అనంతరం విలేకర్లతో కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్ద ముదస్తు బిల్లులు లేకుండా లోడింగ్ చేయరని, అనుమతి లేని వాహనాలు స్టాక్ పాయింట్ వద్ద ఉండకూడదని అన్నారు. సీరియల్ ప్రకారం లోడింగ్ చేయాలని, స్థానికత పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వాళ్లపై కేసు నమోదుకు పోలీసుశాఖకు ఆదేశాలిచ్చామని చెప్పారు. సచివాలయంలో బిల్లు చెల్లించి లోడింగ్ పాయింట్ వద్దకు రావాలని వాహనదారులకు సూచించారు. సచివాలయంలో బిల్లులు కాకుండా స్థానిక స్లిప్పులతో లోడింగ్ చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయన్నారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, కొత్తగా డీ-సిల్టింగ్ పాయింట్లను గుర్తించామని తెలిపారు. ఇసుకను అక్రమంగా డంప్ చేసి బ్లాక్ మార్కెట్లో అమ్మకం నిషేదమని, ఎవారైనా అక్రమాలకూ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక తరలింపులో అవకతవకలు లేకుండా సరైన కొలతలతో నింపాలని, వాహనంపైన టార్పాలిన్‌తో కవర్ ఏర్పాటు చేసి తరలించాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ ఇసుక పాయింట్‌ల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, క్యూ లైన్ పద్ధతి, అక్రమ ఇసుక రవాణా నిరోధించే ప్రక్రియను కొనసాగుతుందని అన్నారు. తనిఖీల్లో ఆర్‌డిఒ మురళి, భూగర్భ, గనుల శాఖ సహాయ సంచాలకులు నాగిని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

30న సిఎం రాకకు ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కాకాని పరిధిలోని జెఎన్‌టియు కళాశాలలో వనమహోత్సవానికి హాజరయ్యేందుకు ఈనెల 30న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళశారం పరిశీలించారు. జెసి సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు, ఆర్‌డిఒతో కలిసి ఆ ప్రాంగణంలో కలియ తిరిగారు. హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం భద్రతా అంశాలపై కళాశాల యాజమాన్యంతో చర్చించారు. తహాశీల్దార్ కె.వేణుగోపాల్, ఆర్ అండ్ బి అధికారులు, అటవీ శాఖాధికార్లు పాల్గొన్నారు.

జ్వరాలతో అల్లాడుతున్న మాచర్ల పరిసరాల జనం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. రోజు పదుల సంఖ్యలో ఆసుపత్రుల్లో జ్వర పీడితులు చేరుతున్నారు. వైరల్, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో పాటు అక్కడక్కడ డెంగీ కేసులు నమోదవుతున్నట్లు ప్రభుత్వ వైద్యశాఖ అధికారులు అంటున్నారు. గత నెల నుండి నెలకు 150-200 వరకు జ్వరాలతో ఆసుపత్రుల్లో ఇన్‌షేషెంట్లుగా చేరుతున్నట్లు, ఇంతకు రెట్టింపు మంది ఏ రోజుకారోజు వైద్యం చేయించుకుని వెళ్తున్నట్లు ప్రభుత్వాస్పత్రి వైద్యులు చెబుతున్నారు. జ్వరాలపై ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను మాట్లాడుతూ ప్రధానంగా దోమల వల్ల జ్వరాలు వస్తుంటాయని, పారిశుధ్యం విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీరు కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరాలతో చికిత్స పొందే వారి వివరాలను ప్రజారోగ్యశాఖ అధికారులు సేకరించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మురుగు నీరు పారుదల జరిగేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. దోమల నివారణకు ప్రతిరోజూ బ్లీచింగ్ చల్లించాలంటున్నారు. అయితే జ్వరాలపై ప్రభుత్వంలో తగినంత అప్రమత్తత లేదనే విమర్శలు వస్తున్నాయి.

సాగర్ 2 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : ఎగువన శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 2 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 30026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి సాగర్ జలాశయానికి 79,260 క్యూసెక్కుల వరద వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 590 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 312.0450 టీఎంసీల నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,394 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 9160 క్యూసెక్కులను, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కులను, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులను, లో లెవల్ కెనాల్ ద్వారా 600 క్యూసెక్కులను, మొత్తంగా 79,260 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

ఫణిదం చేనేత సొసైటీలో వస్త్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ రేఖారాణి

డిజైనింగ్‌లో శిక్షణ ద్వారా చేనేత సొసైటీల అభివృద్ధి

- ట్రైనింగ్ సెంటర్‌గా యాంకీ యారన్ ప్రాసెస్ అండ్ ప్రొడక్షన్ యూనిట్ మార్పు
- హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ రేఖారాణి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఫణిదం చేనేత సొసైటీలో పనిచేసే కార్మికులకు నూతన డిజైన్ పట్ల శిక్షణిచ్చి సొసైటీని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తామని కమిషనర్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ రేఖా రాణి అన్నారు. పట్టణ సమీపంలోని శాతవాహన స్పిన్నింగ్ మిల్లు, యాంకియారాన్ ప్రాసెస్ అండ్ ప్రొడక్షన్ యూనిట్‌ను మంగళవారం సందర్శించిన ఆమె మాట్లాడుతూ యాంకి యారన్ ట్రైనింగ్ డైయింగ్ యూనిట్‌ను ట్రైనింగ్ సెంటర్‌గా మార్పు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం రైల్వే గేట్ సమీపంలోని ఫణిదం చేనేత సొసైటీని సందర్శించి కార్మికులు నేసిన వస్త్రాలను పరిశీలించి నాణ్యతను అభినందించారు. కార్మికులు ప్రత్యేక శిక్షణ పొందడంతోపాటు కొత్తవారికీ అవకాశం ఇచ్చి ఎక్కువమందిని చేనేత సహకార రంగంలోకి తేవాలని చెప్పారు. తద్వారా చేనేత సహకార రంగాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ పి.వనజ, డిఒ నాగమల్లేశ్వరరావు, ఎడిఒ రాఘవరావు, సొసైటీ అధ్యక్షులు కె.శివదుర్గారావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సాగర్‌ను నాగార్జున సాగర్ నీటితో నింపండి : సిపిఎం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : స్థానిక ఎన్టీఆర్ సాగర్‌ను నాగార్జునసాగర్ జలాలతో నింపాలని సిపిఎం పట్టణ కమిటీ కోరింది. ఈ మేరకు మున్సిపల్ ఇన్‌ఛార్జి మేనేజర్ అప్పారావుకు సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సాగర్‌లో మీరు లేక ఎండిపోయిందని, ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాలు ఎన్ఎస్పి కెనాల్స్ ద్వారా వృథాగా వాగులకు పోతున్న నేపథ్యంలో ఆ నీటిని స్థానిక ఎన్టీఆర్ సాగర్‌కు కు మళ్లించాలని కోరారు. దీని ద్వారా ఎన్‌టిఆర్ సాగర్ వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్‌లో నడిచే వాకర్లకు ఆహ్లాదకర వాతావరణం అందుతుందని చెప్పారు.

కేరళ ప్రభుత్వం పంపిన అభినందన పత్రం చూపుతున్న విద్యార్థులు

విద్యార్థుల సాయానికి కేరళ ప్రభుత్వం అభినందన

ప్రజాశక్తి - తుళ్లూరు

కేరళలోని వయనాడ్ వరద బాధితులను ఆదుకునేందుకు చిన్నారులు సాయం అర్థించారు.రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాల విద్యార్థులు వాయనాడ్ బాధితుల కోసం మంగళవారం ఇంటింటికి తిరిగి రూ 4,500లు సేకరించారు.సేకరించిన సొమ్మును కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి పంపారు.కేరళ ప్రభుత్వం విద్యార్థులకు అభినందన పత్రంతో పాటు నగదు జమ రశీదును పంపింది.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఖాసీం, ఉపాధ్యాయురాలు నూర్జహాన్ విద్యార్థులకు సహకరించారు.

పారిశుధ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్య పనుల కోసం వార్డు సచివాలయాల వారీగా ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్‌ని పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఎంహెచ్ఓను ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో ప్రజారోగ్య విభాగం అధి.కారులతో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ ప్రజారోగ్య కార్మికులు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ, మరి కొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉన్నారని, వీరందర్నీ రేషనలైజేషన్ చేస్తే మెరుగైన పారిశుధ్యం వీలవు తుందన్నారు. జనాభా, నివాసగృహాలు, కమర్షియల్ సంస్థలు ఆధారంగా కార్మికుల కేటాయింపులు చేపట్టా లన్నారు. ప్రధాన రహదారులు స్వీపింగ్ యంత్రాల ద్వారా శుభ్రం చేయాలన్నారు. ఈ-ఆటోలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్, ఆటోల కంపెనీ ప్రతినిధుల నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకో వాలన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ మధుసూదన్, ఈఈ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి..

గుంటూరు నగరంలో రోడ్ల మీద, మార్జిన్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను, ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, పట్టణ ప్రణాళిక దళం తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నగరంలో రోడ్ల ఆక్రమణలు, ఫ్లెక్సీల తొలగింపు పై పట్టణ ప్రణాళిక దళంతో నగరంలో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడి తగు ఆదేశాలు జారీ చేశారు.రోడ్ల విస్తరణ జరిగినప్పటికీ ఆక్రమణల వలన ఉపయోగం లేకుండా పోతుందన్నారు. అలాగే వివిధ కార్యక్రమాల పేరుతో అనుమతి లేకుండా ఫ్లెక్సీ బ్యానర్లు కడుతున్నారని, అవి గాలికి ఊడిపోయి వాహనాల మీద పడుతున్నాయన్నారు. 7 రోజుల్లో రోడ్ల మీద ఆక్రమణలు, ఫ్లెక్సీలను నూరు శాతం తొలగించాలని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

గెలుపొందిన విద్యార్థులతో డాక్టర్ కృష్ణప్రసాద్ తదితరులు

పలు పోటీల్లో కెఎల్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగుర వేశారని పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. మోతడకలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఆనంద్ వింగ్స్ వారు నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో 13 సంవత్సరాల విభాగంలో పి.యశ్వంత్ రాజ్‌కుమార్ 3వ బహుమతి, 11 సంవత్సరాల విభాగంలో బి.ప్రణీత్ ప్రధమ బహుమతి, 9 సంవత్సరాల విభాగంలో ప్రవీణ్ శ్రీనివాస్ రెండో బహుమతి సాధించారన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన పోటీలలో చిత్రలేఖనంలో రిత్విక్ ఆరోహ, వెంకటదక్ష, జతిన్ కోటేశ్వర అయాన్, వర్షిణి, నివృత్‌రెడ్డి, యన్.కారుణ్య, ఎస్.కె.షాజిన్, కీర్తి, కార్తీక్, ఎస్.కె.ఆర్యసుల్తాన్, విరాట్, రమ్యశ్రీ, జి.జాన్సన్ ఒలివర్, సిహెచ్.హన్విక్, బి.ఆద్విక్, ఆర్.ఆరాధ్య, జి.అమృత, వి.ప్రణవి, కె.జాహ్నవి ఆలియా, పి.ప్రశస్థ, సిహెచ్.లహరి వివిధ బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను డాక్టర్ కృష్ణప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అధ్యాపకులు ఆయా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

నూతన ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై దృష్టి సారించాలని భవన నిర్మాన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కోరారు. బి.సత్యనారాయణ అధ్యక్షతన సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టకపోవడం బాధాకరమని అన్నారు. యువగళం పాదయాత్ర, టిడిపి ఉమ్మడి మేనిఫెస్టోలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవట్లేదన్నారు. తక్షణమే భవనిర్మాణ సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని, సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలని కోరారు. ఇసుక ఉచితంగా ఇస్తున్నామని రోజు ఆర్భాటపు ప్రకటనలే తప్ప వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందన్నారు. ఇసుక రేట్లు తగ్గకపోవడం, ఇసుక రావడానికి రోజులు తరబడి నిరీక్షించడం వంటి ఇబ్బందుల వల్ల గృహ యజమానులు కొత్త పనులు ప్రారంభించడానికి సిద్ధం కావడం లేదని అన్నారు. ఇసుక తక్షణమే అందుబాటులోకి తేవాలని కోరారు. స్టాక్ పాయింట్స్ దగ్గర ఉన్న ఇసుకను మాత్రమే సరఫరా చేస్తున్నారని, రిచ్ నుంచి తీయకపోవడం వల్ల ధరల్లో మార్పు లేదన్నారు. ఇసుక అందుబాటులో లేక పనులు లేక కార్మికులు కుటుంబాలు గడవక ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. కావున లక్షల మంది ఆధారపడిన ఈ రంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు నగర కార్యదర్శి ఎస్.కె.కాశీంవలి, కోటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్నాడులో ఖాళీగా ఉన్న ఎఎల్‌ఒ పోస్టులు భర్తీ చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

పల్నాడు జిల్లాలో ఖాళీగా ఉన్న సహాయ కార్మిక అధికారి పోస్టులను భర్తీ చేయాలని పల్నాడు భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం(సిఐటియు) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులోని ఉపకార్మిక కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. పల్నాడు జిల్లాలోని వినుకొండ, మాచర్లలోని సహాయ కార్మిక అధికారి పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల నర్సరావుపేట ఏఎల్‌ఒను ఇన్‌చార్జిగా నియమించారని, సదరు అధికారి పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవటం వల్ల నర్సరావుపేట, వినుకొండ, మాచర్ల ప్రాంతాల్లోని కార్మికుల సమస్యలు చెప్పుకోవటానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్మికులు ఒకే పని కోసం అనేక సార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. కావున వినుకొండ, మాచర్లలో పూర్తి స్థాయి సహాయ కార్మిక అధికారులను నియమించాలని కోరారు. వినపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవ్వారు ప్రసాదరావు, సిలార్ మసూద్, గుంటూరు నగర నాయకులు ఖాసిం వలి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార్మిక కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

11న రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు

రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవటానికి సెప్టెంబర్ 11న, బ్రాడీపేటలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కమిటీ సమావేశంలో తీర్మానించారు. వేంపాటి చిన్న కొండయ్య (సీతయ్య) అధ్యక్షతన మంగళవారం పాత గుంటూరలోని ప్రజాసంఘాల కార్యాలయం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ నగరంలో వివిధ అపార్ట్మెంట్ వాచ్మెన్ కం ఇస్త్రీదారులు మహాసభ, అలాగే జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న రజక వృత్తిదారుల సభలను, 11న జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ లోన్లు మంజూరు చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం జిఎంసి నూతన కమిషనర్ పులి శ్రీనివాసులును యుటిఎఫ్ నాయకులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వైద్య అవసరాలు, పిల్లల ఫీజుల కోసం లోన్లు దరఖాస్తు చేసుకున్నారని చాలా కాలంగా పిఎఫ్ లోన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో స్పందించిన కమిషనర్ సంబంధిత సూపరింటెండెంట్‌కు వెంటనే లోన్లు మంజూరు చేయాలని సూచించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యుటిఎఫ్ నగర అధ్యక్షులు యం.చిన్నయ్య, బి.ప్రసాద్, శివన్నారాయణ, బి.నరసింహారావు, పి.రమేష్, సాయిమల్లిఖార్జున్, మధు తదితరులున్నారు.

నగర కమిషనర్‌కు బొకే అందచేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాట్లాడుతున్న డిఆర్‌ఎం రామకృష్ణ

ఏకీకృత పెన్షన్‌తో 3750 మందికి లబ్ధి

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీమ్ వల్ల గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 4707 మంది ఉద్యోగులలో దాదాపు 3750 మందికి లబ్ధి చేకూరుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. మంగళవారం డిఆర్‌ఎం ఆఫీసులు మీడియా సమావేశంలో ఏకీకృత పెన్షన్ స్కీమ్ గురించి వివరించారు. ప్రస్తుతం ఎన్‌పిఎస్ కింద ఉన్న ఉద్యోగులందరికీ నూతన యుపిఎస్ పథకంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దీని ద్వారా కనీసం 25 సంవత్సరాల సర్వీసు ఉండి, సూపర్ యాన్యుయేషన్‌కు ముందు గత 12 నెలలలో తీసుకున్న సగటు ప్రాథమిక వేతనంలో 50శాతం ఇస్తారని, ఈ చెల్లింపు కనీసం 10 సంవత్సరాల సర్వీసు వరకూ తక్కువ సేవా కాలానికి అనులోమానుపాతంలో ఉండాలన్నారు. ఈ పథకంలో కుటుంబ పెన్షన్‌కు హామీ ఇవ్వబడింది అన్నారు. హామీ ఇవ్వబడిన కనీస పెన్షన్ కనీసం 10 సంవత్సరాల సర్వీసు తర్వాత సూపర్‌యాన్యుయేషన్‌పై నెలకు రూ.10వేలు ఇస్తారన్నారు. ఈ పథకంలోని ఇతర బెన్ఫిట్స్‌ను వివరిస్తూ ఏకీకృత పెన్షన్‌ను స్వాగతిస్తున్నామని చెప్పారు.2004 జనవరి తర్వాత సర్వీసులో చేరిన వారికి యుపిఎస్ వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సమవేశంలో సీనియర్ డిపిఒ షేక్.షహబాజ్, సీనియర్ డిఎఫ్ఎం అమూల్య బి.రాజ్, సీనియర్ డిసిఎం సిహెచ్.ప్రదీప్‌కుమార్, డిసిఎం కె.కమలాకరబాబు తదితరులు హాజరయ్యారు.

ఉట్టి కొడుతున్న విద్యార్థులు

విజ్ఞాన్స్‌లో వైభవంగా ఉట్టి ఉత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స యూనివర్సిటీలో శ్రీకష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఉట్టి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్స విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హాజరై ఉట్టి ఉత్సవాన్ని ప్రారంభించి, ప్రసంగించారు.ఉట్టి ఉత్సవం ఐక్యతకు, సమష్టి తత్వానికి ప్రతీక అని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఉట్టి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. తక్కువ సమయంలో ఉట్టిని పగులగొట్టిన మొదటి మూడు టీమ్‌లకు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతున్నది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవిఎస్‌బిజి పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచెస్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ బెంచెస్ ద్వారా సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో వారు ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎల్‌ఎఒపి కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు, పోలీస్‌వారు, స్టేక్ హెూల్డర్స్ అందరు ఈజాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారానికి సహకరించాలని, ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్యంగా సివిల్ కేసులలో అప్పీల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీచేసే దిశగా కక్షిదారులకు, న్యాయవాదులకు తెలిపారు.

పేదలకు స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మన అసోసియేషన్ ప్రధాన సలహాదారు రామనాథశర్మ మాతమూర్తి అనసూయమ్మ సంస్మరణార్థం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో భోజనం చేసే వారందరికీ స్వీటు గారెలు మంగళవారం పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్‌లో భోజనం చేసిన వారందరికీ ఖర్చును శర్మ భరించారు. ఈ కార్యక్రమంలో మన అసోసియేషన్ అధ్యక్షులు నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి నాగేశ్వరరావు, ట్రెజరర్ గాలిబ్, రామరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు, బీమా చేసుకోండి

ప్రజాశక్తి -పెదకూరపాడు

పొదుపు ఆరోగ్య బీమా ప్రతిఒక్కరూ నమోదు చేసుకోవాలని పెదకూరపాడు ఈవో పిఆర్‌డి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐటిసి బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలలో 'ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత' అంశాలపై మండల స్థాయి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, జీవిత బీమా కార్యక్రమాల ద్వారా గ్రామాలలోని పేదలకు ఆరోగ్య, బీమా ప్రయోజనం కలుగుతుందన్నారు. సెర్ప్ సంస్థ వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి ముద్ర యోజన, ప్రధానమంత్రి సూరక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, పథకాల ప్రయోజనాలను వివరించారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ప్రయోజనం పొందడం, పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అందరు క్లాప్ మిత్రాలు, ఐటీసీ సెర్ప్ సంస్థ ప్రతినిధులు, సతీష్, బొల్లయ్య పాల్గొన్నారు.

సోలార్ సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి-ఈపూరు

మండల పరిధిలో ఐదు ఎకరాలలో సోలార్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్థల పరిశీలన చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎస్.గాంధీబాబు మంగళవారం తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఐదు ఎకరాలు స్థలం అవసరమని ఎవరైనా రైతులు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు ముందుకు వస్తే సంవత్సరానికి ఎకరానికి రూ.30వేలు అద్దె చెల్లించడంతో పాటు ప్రతి సంవత్సరమూ ఐదు శాతం అద్దె పెంచుతారని అన్నారు. 20 సంవత్సరాలు విద్యుత్ శాఖకు అద్దె ప్రాతిపదికన 5 ఎకరాలు ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న రైతులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఏఈ కోరారు.

గ్రోమోర్ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - నకరికల్లు

మండల కేంద్రమైన నకరికల్లులోని గ్రోమోర్ కేంద్రంలో మండల వ్యవసాయాధికారి దేవదాసు మంగళవారం తనిఖీలు చేపట్టారు. పురుగు మందు నిల్వలు, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. పురుగు మందుల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

పంట నమోదుకు తంటాలు

ప్రజాశక్తి పెదకూరపాడు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో కౌలు రైతులు ఎక్కువమంది సాగులో ఉన్నారు. వీరిలో ఎకరం, అరెకరం, రెండు ఎకరాలు సొంత భూమి కలిగి ఉండి మరికొంత భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసేవారు ఉన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. మండలంలో సాగు భూమి 22,735 ఎకరాలు ఉండగా ఇందులో 12 వేల ఎకరాల్లో పత్తి, సోయ, మొక్కజొన్న తదితర పంటలు సాగయ్యాయి. ఇందులో 5100 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు కాగా మొత్తం సాగులో ఇది 42 శాతమే. మండలంలో సగం పొలాలను కౌలురైతులు సాగు చేస్తున్నారని అంచనా కాగా వీరిలో 2363 మందికి ఈ ఏడాది కౌలురైతు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి) ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించి అందుకనుగుణంగానే మంజూరు చేశారు. అయితే వాస్తవ సాగుదారుల్లో ఇది చాలా నామమాత్రమే. మండలంలో అధికంగా పత్తి, మిర్చి ఇతర వాణిజ్య పంటలు ప్రధానంగా సాగయ్యేవి. అయితే ప్రస్తుతం మిర్చి విస్తీర్ణం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొక్కజొన్న, శనగ పంటలు వేస్తున్నారు. ఎక్కువ మంది శనగకు మొగ్గు చూపడం, అక్టోబర్, నవంబర్ ఈ పంట సాగకు కాలం కావడంతో ప్రస్తుతం పలుచోట్ల ఖాళీ పొలాలు దర్శనమిస్తున్నాయి.

అందుకే ఈ-క్రాప్ జాప్యం

రైతులు పథకాలు పొందాలన్నా, రాయితీలు, పరిహారం దక్కాలనా, పంటలు అమ్ముకోవాలన్నా ఈ-క్రాప్ కీలకం. అయితే దీని నమోదులో సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులు ప్రస్తుతం రైతుల మెడలకు శాపాలుగా

ఎల్పీ నంబర్లో తేడాలు - 15 వరకు అవకాశం

చుట్టుకున్నాయి. ఈ-క్రాప్ చేయటానికి వెళ్లిన వ్యవసాయ శాఖ సిబ్బందికి పలు సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వే నంబర్లు వరుసగా ఉంటాయి. కొలతలు అనంతరం ఈ సర్వే ప్రకారం ఇచ్చిన ఎల్పీ నంబర్లు తప్పుల తడకగా ఉండడంతో ఈ-క్రాప్ నమోద జాప్యమవుతోంది. రైతుల విస్తీర్ణంలో కూడా తేడాలు ఉన్నాయి. ఈ-క్రాప్‌కు వెళ్ళిన సిబ్బంది ఎల్పీ నంబర్లు, పాత సర్వే నెంబర్లు రెండు పరిశీలించుకుంటూ నమోదు చేయాల్సి వస్తోంది. ఆగస్టు మొదటి వారంలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాగా తొలుత సర్వరు సరిగా రాలేదు. ఇప్పుడు ఆ సమస్య తొలగినట్లు సిబ్బంది చెబుతున్నారు. వచ్చేనెల 15వ తేదీ వరకు నమోదుకు అవకాశం ఉండగా మిర్చిని ఆ తర్వాతే సాగు చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు గడువును పెంచే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శాంతి చెప్పారు. గ్రామ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది ఈ-క్రాప్‌ను వేగంగా నమోదు చేస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా భూ యజమానితో సంబంధం లేకుండా కౌల్దార్లకు గుర్తింపు కార్డుల జారీతోపాటు ఈ-క్రాప్‌లో వారిపేరే నమోదు చేయాలని వ్యవసాయ కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు టి.హనుమంతరావు కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు, ఫర్నిచర్, క్రీడా సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అత్తోట మురళి ముకుంద్ సేవలు ఆదర్శనీయమని ఎంఇఒ-2 తాడిశెట్టి సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం కాకాని వెంకటరమణ అన్నారు. మంగళవారం పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.రెండు లక్షలు విలువైన క్రీడా సామాగ్రి, ఫర్నిచర్‌ను మురళి ముకుంద్ తన బంధువు లక్ష్మీనారాయణ ద్వారా హెచ్‌ఎం కెవి రమణకు అందించారు. మూడు, నాలుగు, 5 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు నోటు పుస్తకాలనూ ఉచితంగా అందజేశారు. పెదకూరపాడులోని ఎంపిపిఎస్(హెచ్ డబ్ల్యు), ఎంపీపీఎస్ (ఉర్దు), ఎంపీపీ ఎస్ (జనరల్), ఎంపీపీ ఎస్ (జెబి), లగడపాడులోని ఎంపీపీ ఎస్ (జెబి), కన్నెగండ్లలోని ఎంపీపీ ఎస్ (జనరల్)కు నోటుపుస్తకాలు అందజేశారు. గతంలో మురళి ముకుంద్ పెదకూరపాడు హైస్కూల్‌కు డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ఏర్పాటు చేయించారు. తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఎన్నో సేవా కార్యక్రమాలలో ప్రజల మన్నన చురగొన్న హెల్ప్ ఫౌండేషన్కు మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డును అందుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కె.బుల్లిబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణాన్ని కేంద్రంగా చేసుకొని హెల్ప్ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని మదర్ థెరిస్సా సొసైటీ సేవా సంస్థ నిర్వాహకులు మల్లాడి ప్రసాదరావు కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణ, ఏపీలలో సేవా కార్యమాలు అందిస్తున్న పలు సంస్థలతో పాటు తమ సంస్థ అయిన హెల్ప్‌ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను గుర్తించారన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని హనుమంతరాయ గ్రాంథాలయం(డాక్టర్ అక్కినేని నాగేశ్వరావు కళావేదిక)లో ఘనంగా సత్కరించి అవార్డును అందించారన్నారు. తమ సంస్థ సేవకు అవార్డు తీసుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంస్థ విజయానికి కారణమైన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో హర్షిత డెవలపర్స్ జనరల్ మేనేజర్ సంపత్ కుమార్, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు చక్రవర్తి, హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దాస్, పలువురు బుల్లితెర నటులు హాజరైనట్లు తెలిపారు.

విషజ్వరాలపై సత్వర చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలో ప్రబలుతున్న విషజ్వరాలపై సత్వర చర్యలు చేపట్టాలని టిడిపి, జనసేన నాయకులు ఏరియా వైద్యశాల ప్రధాన వైద్యులను కోరారు. మంగళవారం టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరావు, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్లు, ఏరియా వైద్యాశాల ప్రధాన వైద్యులు లక్ష్మణరావుతో ఏరియా వైద్యాశాలలోనే సమావేశమయ్యారు. ప్రబలుతున్న విషజ్వరాలను అరికట్టాలని కోరారు. తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేకు బీజేపీ నేత పరామర్శ

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి నియోజకవర్గం బీజేపీ అధ్యక్షులు కట్టా శంకరరావును సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కారంపూడి

స్థానిక సెయింట్ జాన్స్ హైస్కూల్ జూనియర్ కాలేజిలో హెచ్‌ఐవి, లైంగిక వ్యాధులపై 'మీకు తెలుసా' అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. న్యాకో(ఎన్‌ఏసిఓ) నేతృత్వంలో రాష్ట్రస్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్‌ను ఛైల్డ్‌ఫండ్ ఇండియా లింకు వర్కర్ స్కీము వారు ఏర్పాటు చేశారు. లింక్ వర్కర్ రాజేశ్వరి మాట్లాడుతూ ఛైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము ఉమ్మడి గుంటూరు జిల్లాలో 100 గ్రామాల్లో పనిచేస్తున్నామన్నారు. ఈ ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్ ద్వారా పల్నాడు జిల్లాలోని 55 గ్రామాలలో ఎనిమిది వారాలపాటు హెచ్‌ఐవి, టిబి, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు, ఐఇసి మెటీరియల్స్ మరియు ఫ్రీ కండోమ్ డిస్ట్రిబ్యూషన్, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ బినోమ మాట్లాడుతూ హెచ్‌ఐవి, టిబి, సుఖవ్యాధులు, పరీక్ష ప్రాముఖ్యత గురించి తెలియజేసినారు. ఫాదర్ రెవరెంట్ అనిల్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

'మీకు తెలుసా' ప్రచార నిర్వహణలో భాగంగా హెచ్‌ఐవి, లైంగిక వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు ఆగస్టు 12 నుండి అక్టోబర్ 11వ తేదీ వరకు న్యాకో ఎన్‌ఏసిఓ నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్రస్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఇ సి క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగముగా ఛైల్డ్ ఫండ్ ఇండియాలింకు వర్కర్ స్కీము అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. జిల్లా రిసోర్స్ పర్సన్ ఎమ్.వాసుదేవరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కోటా శ్రీనివాసు, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎఎన్‌ఎమ్ రాణి, లింక్ వర్కర్ చిన్ని, ఆశా కార్యకర్తలు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ హైస్కూల్ జూనియర్ కాలేజిలో..

ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహనాసదస్సు

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : జిల్లాకలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ, అర్బన్ గహాల నిర్మాణం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి అయ్యేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజతో కలసి అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రెవెన్యూ డివిజన్ అధికారులు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, వ్యవవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయటానికి, స్టేజ్ అప్డేషన్ కు నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించేలా సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు.సిసిఆర్‌సి కార్డులకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని, సీజనల్ వ్యాధులు నివారించేందుకు పక్కాగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, రక్షిత మంచి నీటిని నిర్దేశించిన ప్రకారం నాణ్యతా పరీక్షలు నిర్వహించి సరఫరా చేయాలని, ఆగష్టు 30న తేదిన నిర్వహించే వన మహెూత్సవానికి మొక్కలు సరఫరా చేయాలన్నారు. 1వ తేదీన పెన్షన్ల పంపిణీ, ఈ పంట నమోదు, ఈకేవైసీ, స్థలాల మార్కెట్ వాల్యూ రివిజన్, నివాస, వాణిజ్య , ల్యాండ్ కన్వర్షన్ , జాతీయ రహదారులు , ఇతర ప్రాజెక్టులకు చేసిన భూసేకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికేట్ల దరఖాస్తులతో పాటు ఇతర రెవెన్యూ దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా సక్రమంగా పరిష్కరించేలా తహశీల్దార్లు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మీ

జిఎంసి ఖాళీ స్థలాల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని, ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్దం చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ ఇన్నర్ రింగ్‌రోడ్, టీచర్స్ కాలనీ, మల్లికార్జునపురం, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి జిఎంసికి చెందిన ఖాళీ స్థలాలు, పార్కులు, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్‌గానీ, కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు, అవసరమైన ప్రాంతాల్లో పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు వార్డుల వారీగా జిఎంసి ఖాళీ స్థలాల వివరాలతో నివేదిక ఇవ్వాలన్నారు. తొలుత టీచర్స్ కాలనీ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కులలో నాటే మొక్కల్లో ఔషధ మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏడిహెచ్‌కి సూచించారు. టీచర్స్ కాలనీ ప్రాంతంలో డ్రైన్‌లో మురుగు పారుదల లేదని, వెంటనే కచ్చా కాల్వ ఏర్పాటు చేయాలని, ఆయా ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుపై అంచనాలు సిద్దం చేయాలన్నారు. సదరు ప్రాంతంలో అనధికార బోర్లు వేసి నీటి విక్రయాలు చేస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు త్వరలో వాటిపై ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేపట్టి నిబంధనల మేరకు లేని వాటి నిర్వహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అమరావతి రోడ్డులో ఆక్రమణలు గమనించి సంబంధిత సచివాలయ ప్లానింగ్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణం ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ శ్రీనివాస్, డిఈఈ సతీష్, ఏడిహెచ్ రామారావు, ఏసిపి మురళి తదితరులు పాల్గొన్నారు.

నీటి కుళాయి, ఆస్తి పన్ను లేని ఇళ్లను గుర్తించాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో వాటర్ ఎనాలసిస్ పెండింగ్ సర్వే యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిఎంసి కౌన్సిల్ హాల్లో సర్వే నిర్వహణపై ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఇంటికి నీటి కుళాయి అందించే లక్ష్యంగా ఇంటింటి సర్వే చేపట్టటం జరిగిందన్నారు. ఆస్తి పన్ను లేని ఇళ్లను గుర్తించారన్నారు. ఇప్పటికి 1790 మాత్రమే గుర్తించడం జరిగిందని, నగరంలో పన్ను లేని గృహాలను తమ క్షేత్ర స్థాయి పర్యటనలో గుర్తిస్తే సంబధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరంలో ఆస్తి పన్ను లేని గృహ యజమానులు, ఆక్రమిత గృహాలు కలిగి, ఆస్తి పన్ను లేని వారు సమీప వార్డు సచివాలయంలో ఆస్తి పన్ను కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆస్తి పన్ను విధించిన వెంటనే తాగునీటి కుళాయి కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ అంశంపై ప్రత్యేకంగా 15రోజులు డ్రైవ్ చేపడతామని, ఇళ్లు ఉండి కుళాయి, ఆస్తి పన్ను లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన ఏఈ అనూష, డిఈఈ సతీష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఈఈని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా

న్యాయమూర్తి పవన్ కుమార్ తెలుగులో తీర్పు

ప్రజాశక్తి - తెనాలి

ఈ నెల 29 గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు తీర్పుల వారోత్సవాలలో భాగంగా తెనాలి ప్రధాన పౌర న్యాయమూర్తి పవన్ కుమార్ ఏకా తెలుగులో తీర్పు చెప్పారు. వారోత్సవాలు పాటిస్తూ మంగళ వారం ఒక పౌర దావాలో ఆయన తెలుగులో తీర్పు ఇచ్చారు. ఈ వారమంతా ప్రతి రోజూ ఒక తీర్పు తెలుగులో చెబుతూ తెలుగు భాషపై మక్కువను వ్యక్తం చేస్తున్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సూచనల మేరకు ఆయన ప్రాంతీయ భాషలో తీర్పు ఇస్తున్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - తెనాలి

వినాయక చవితి సందర్భంగా పట్టణంలో చవితి మండపాల ఏర్పాటుకు అనుమతులు, నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై కమిషనర్ బి శేషన్న అధ్యక్షతన మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో సమీక్ష జరిగింది. పోలీస్, రెవెన్యూ, ఫైర్, ఇరిగేషన్ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. చవితి మండపాల ఏర్పాటు నిబంధనలు, మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి తీసుకోవాల్సిన అనుమతులు, నిమజ్జన ఊరేగింపులో పాటించాల్సిన నిబంధనలు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, మొత్తంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా వేడుకలు నిర్వహించుకునేలా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సమిష్టిగా చర్చించారు. కార్యక్ర మంలో డిఎస్పి బి.జనార్ధనరావు, తహశీల్దార్ కె.వి గోపాల కృష్ణ, ఇరిగేషన్ ఇఇ ఎస్ మల్లికార్జున, రూరల్ సీఐ బి శ్రీని వాసరావు, ఇన్చార్జి ఎంఇ శ్రీనివాసరావు, శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కరెంటుకు చేనేత కార్మికులు దరఖాస్తులు

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేత కార్మికులకు 200 కరెంటు యూనిట్లకు ఉచితంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో ఉన్న చేనేత కార్మికులు చేత దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. దరఖాస్తులను మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఏఈ నాగమల్లేశ్వరరావు కు, విద్యుత్ కేంద్రం ఏ ఈ కి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఈలు స్పందిస్తూ వెంటనే అమలకు చర్యలు తీసుకు ంటున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు కౌతవరపు వెంక టేశ్వరరావు, డోకుపర్తి రామారావు, జిల్లా నాయకులు చిట్యాల సీతారామాంజనేయులు, కాకి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో ఎమ్మెల్యే మధవి భర్త

గుంటూరు కోర్టులో భాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ ఎంఎల్ఏ గల్లా మాధవి భర్త రామచంద్ర రావు భూవివాదం లో చిక్కుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు విద్యా నగర్ నివాసి కమ్మ వెంకట్రావు కి చెందిన భూమి ని తనకు విక్రయించమని గల్లా రామచంద్ర రావు వత్తిడి చేశారు. ఇందుకు వెంకట్రావు నిరాకరించారు. దీంతో రామచంద్ర రావు తన మనుషులతో వెంకట్రావు, ఆయన కుమారుడు డాక్టర్ హరీష్ పై గత శని వారం దాడి చేయించారు. దాడి సమయంలో అక్కడే ఉన్న పట్టాభిపురం పోలీసులు పట్టించుకోలేదు. అంతే గాక తన పై దళిత యువకుల చేత ఫిర్యాదు చేయించి ఎస్.సి. ఎస్.టి.కేసు నమోదు చేయించారని వెంకట్రావు మంగళవారం గుంటూరు జిల్లా న్యాయ స్థానంలో ఫిర్యాదు చేశారు. తన పై తప్పుడు ఆరోపణలు చేసిన ఎంఎల్ఏ భర్త రామచంద్ర రావు వత్తిడి తో పట్టాభిపురం పోలీసులు తమ పైనే కేసు నమోదు చేశారని వెంకటరావు ఈ ఫిర్యాదు లో పేర్కొన్నారు. గురజాల వద్ద రామ చంద్రరావుకి ఉన్న భ్రమర టౌన్ షిప్ కి పక్కనే ఉన్న తమ భూమి తక్కువ ధరకు విక్రయించనందుకు కక్ష కట్టి తన మనుషులతో దాడి చేయించి తప్పుడు కేసు పెట్టించారని వెంకట్రావు జిల్లా కోర్టు లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుట్రతోనే ఆరోపణలు

శ్రీ భ్రమర టౌన్‌షిప్ అధినేత గళ్ళా రామచంద్రరావు పై ఉద్దేశ్యపూర్వకంగానే కమ్మా వెంకట్రావు అనే వ్యక్తి అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు రియల్టర్ చల్లా రమేష్ తెలిపారు. గల్లా రామచంద్ర రావు నివాసం లో మంగళ వారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకట్రావు వద్ద నుంచి రూ.30 లక్షలు వడ్డీకి తీసుకొని అందుకు హామీగా తన పొలాన్ని తాకట్టు రిజిస్ట్రేషన్ చేశానని అయన తెలిపారు. నిబంధనల ప్రకారం వడ్డీ చెల్లిస్తున్నానని ఇప్పుడు మొత్తం సొమ్ము ఇస్తానని, తన భూమి తనకి రిజిస్ట్రేషన్ చేయమంటే అదనపు సొమ్ము డిమాండ్ చేయడం వల్ల తాము నిరాకరించడం తో తమపై లేని పోని ఆరోపనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనకు పది రూపాయల వడ్డీ చెల్లిస్తేనే ఆ స్థలాన్ని శ్రీ భ్రమర టౌన్ షిప్ కు రిజిస్ట్రేషన్ చేస్తానని కమ్మా వెంకట్రావు బెదిరించారని, దీని పై అప్పట్లోనే పిడుగురాళ్ళ పోలీస్ స్టేషన్ లో మరియు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చల్లా రమేష్ వివరణ ఇచ్చారు. ఇప్పుడు మరలా 2024లో గళ్ళా రామచంద్రరావు సతీమణి గళ్ళా మాధవి ఎమ్మెల్యే అవ్వటంతో , అసత్య ఆరోపణలు చేసి రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూస్తూ , రాజకీయంగా ఎదుగుతున్న గల్లా మాధవి దంపతులని బెదిరించే ఉద్దేశంతో కొంతమంది అండతో అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు అయన తెలిపారు.

మీడియా తో మాట్లాడుతున్న చల్లా రమేశ్

నేడు మంగళగిరికి రానున్న లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజి శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మంగళగిరి రానున్నారు. బుధవారం ఉదయం 8:15 గంటలకు మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహాస్వామి ముఖ ద్వారం ప్రారంభ కార్యక్రమానికి హాజరు కానునట్లుగా టిడిపి వర్గాలు తెలిపాయి.. అనంతరం శ్రీ లక్ష్మినరసింహాస్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

రేపు గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రచయితల సంఘం, అవగాహన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేదీ ఉదయం 10గంటలకు అరండల్‌పేట 15/1, కుబేర టవర్స్‌లోని అవగాహన సంస్థ కార్యాలయంలో గిడుగు రామమూర్తి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. ప్రముఖ రచయిత డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా పాల్గొంటారన్నారు. అనంతరం రచయితల సంఘం ఆధ్వర్యంలో కవిసమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని ఇందులో రెండు ఉత్తమ కవితలకు నగదు పురస్కారం అందించడం జరుగుతుం దన్నారు. కావున కవులు, కవయిత్రులు, సాహిత్యభిమానులు ఈకార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాదిక్ ను సత్కరిస్తున్న విజయవాడ మదర్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు

తెనాలి వాసికి ఎన్టీఆర్-2024 అవార్డు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మదర్ థెరిసా జయంతి సభలో తెనాలికి చెందిన యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు షేక్ సాధిక్‌కు ఎన్టిఆర్ నేషనల్ 2024 అవార్డు దక్కింది. ఆగస్ట్ 26న విజయవాడ హనుమంత నారాయణ లైబ్రెరీలో జరిగిన మదర్ సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సాదిక్ చేసిన సామాజిక సేవలను గుర్తిస్తూ అవార్డును ప్రధానం చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎంపికచేసిన ప్రముఖులతోపాటు సాదిక్ అవార్డు సాధించడం గర్వకారణంగా ఉందని తన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. అవార్డు పొందడంద్వారా తన బాధ్యత మరింత పెరిగిందని సాదిక్ అన్నారు.

చిర్రావూరిలో రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలోనీ లైబ్రరీ వద్ద అన్నదాత సుఖీభవ సెంటర్ నందు మంగళవారం ఉదయం రైతులకు విబిఎన్ 8 మినుము ఇత్తనాలను రైతులకు వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ అధికారిని శాంతి శ్రీ, టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి శ్రీనివాసరావు రాజీనామా

ప్రజాశక్తి- పొన్నూరు

వైసిపి బీసీ సెల్ అధ్యక్షులు కొల్లేరు శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. స్థానిక ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పార్టీకు వైసిపి పట్టణ బీసీ సెల్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను నమ్మి తాను పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు వరకు తాను పార్టీ కోసం పని చేసినట్లు తెలిపారు. వైసీపీ పార్టీలో బీసీలకు జరిగింది ఏమీ లేదని ఆయన విమర్శించారు.

బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి : ఎమ్మెల్యే నసీర్

ప్రజాశక్తి-గుంటూరు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల ద్వారా పిల్లలు మరింత చురుగ్గా చదువుల్లో రాణిస్తారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం బిఆర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుల్లో ర్యాంకులతో పాటు క్రీడల్లోనూ మంచి నైపుణ్యం ఉండాలని కోరుకోవాలన్నారు. విద్యార్థులు ఏదో ఒక క్రీడలో రాణించే విధంగా తగిన శిక్షణ అందించాలని, వారే రేపటి రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చే క్రీడాకారులుగా నిలుస్తారని అన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందని ప్రపంచ స్థాయిలో పథకాలు సాధించి మన రాష్ట్రానికి పేరు తెచ్చిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ మన జిల్లాలో సబ్ కలెక్టర్ స్థాయి ఉద్యోగాలు సాధించారని ఎమ్మెల్యే నసీర్ గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో బిఆర్ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసి క్రీడలను మరింత ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్ , మీరావలి, డీఎస్ఓ నరసింహారెడ్డి, జాగర్లమూడి శ్రీనివాస్, రియాజ్, ఏల్చూరి కిరణ్, వంగర ఏడుకొండలు, ఐలశీను, కలాం తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు కందిపప్పు, నూనె సరఫరా చేయాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ - 17న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఆఫీసు వద్ద ధర్నా

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 17న గుంటూరు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పి.డి ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశం తీర్మానించింది. స్థానిక పాతగుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎ.వి.ఎన్.కుమారి అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఏ.పి. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం వండి పెట్టేందుకు అవసరం అయిన కందిపప్పు, నూనె తదితర సరుకులను తక్షణమే సరఫరా చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలను వివిధ స్థాయి అధికారులు తనిఖీలు చేసి మెనూ ప్రకారం వండిపెట్టడం లేదని మెమోలు జారీ చేస్తున్నారని, కందిపప్పు, నూనె లేకుండా మెనూ ప్రకారం ఎలా వండి పెడతారని ప్రశ్నించారు. ఇతర కూరగాయలు కొని వండి పెట్టాలని అధికారులు నోటి మాటగా అంటున్నారని కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కూరలు వండి పెట్టడం అసాధ్యమని అన్నారు. కావున ప్రభుత్వం సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ సొంత భవనాల్లో టాయిలెట్లు లేక పిల్లలతో పాటు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారని, టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత డిసెంబర్, జనవరి లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అంగన్వాడీల పోరాటం సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన మేరకు తక్షణమే యూనియన్ నాయకత్వంతో చర్చించి జీతాల పెంపుదలకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం అంగీకరించి ఒప్పందం చేసి మినిట్స్‌గా ఇచ్చిన అన్ని అంశాలకు వెంటనే జి.ఓలు జారీ చేయాలన్నారు. చనిపోయిన అంగన్వాడీలకు మట్టిఖర్చులు ఇస్తామన్న జీ.ఓ ఇంతవరకు జారీచేయకపోవడంతో చనిపోయిన వారి కుటుంబాలకు ఆసరా లేకుండా పోయిందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న వర్కర్స్ స్థానంలో అర్హత ఉన్న హెల్పర్స్‌కి ఉద్యోగం ఇచ్చేందుకు అన్ని రకాల ప్రక్రియలు పూర్తి అయినా ఆరు నెలల నుండి ఉద్యోగాలు ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారని, గత ఎనిమిది నెలల కాలంలో ఖాళీ అయిన వర్కర్స్ పోస్టులలో హెల్పర్స్ ఉద్యోగాలు ఇచ్చే ప్రతిపాదనలు ఇంకా సిద్ధం చేయలేదని అన్నారు. మినీ సెంటర్స్‌ని మెయిన్ సెంటర్స్‌గా మార్చే ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. దీప్తి మనోజ, నాయకులు చిన వెంకాయమ్మ, హేమలత, శివకుమారి, నిర్మలజ్యోతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యుల రక్షణకు చట్టాలు బలోపేతం చేయాలి

డ్రగ్స్, మద్యం, పోర్నోగ్రఫీ వెబ్‌సైట్లను నిషేధించాలి - కలకత్తాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనపై వైద్యుల స్పందన

ఐఎంఎ ఆధ్వర్యంలో తెనాలిలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తెనాలి, పల్నాడు జిల్లా, మంగళగిరి

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కలకత్తాలో వైద్యురాలపై అత్యాచారం చేసి ఆపై ఆమెను హతమార్చిన సంగతి తెలిసిందే. దీనిపై వైద్యులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమా ండ్ చేస్తున్నారు. అదే సమయంలో ఘటనకు పాల్పడిన నిందితులను త్వరితగతిన కఠినంగా శిక్షించాలని కూడా డిమాండ్ చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో వైద్యులు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. తెనాలిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించగా, ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కూడా నిరసనలు వ్యక్తం చేయటం, అదేవిధంగా జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కావా లంటూ ఎల్ఐసి మహిళా ఉద్యోగులు చేసిన నిరసనలు వైద్య లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న అత్యాచారాలను నివారించాలంటే డ్రగ్స్, మద్యం, పోర్నోగ్రఫీ వెబ్సైట్లను నిషేధించడం ద్వారా మహిళలపై దాడులను కొంతమేర అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పలువురు మహిళా వైద్యులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలపై అత్యా చారాలు విపరీతంగా పెరగడం ఆందోళన కలిగిస్తుందని దేశంలో ప్రతి 10 నిమిషాలకు ఒక మహిళ అత్యాచారానికి గురవడం ఒకప్పటి నిర్భయ నుండి నేటి వైద్యుల అత్యాచార సంఘటనలతో మానవత్వం నశిస్తున్నట్లు తెలుస్తుందని మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం డ్రగ్స్, మద్యం, పోర్నోగ్రఫీ వెబ్‌సైట్లను పూర్తిగా నిషేధించడంతో పాటు మహిళా వైద్యులు ఉన్న హాస్పిటల్స్ వద్ద పటిష్ట భద్రత కల్పించాలని పల్నాడు జిల్లా వైద్యులు తమ అభిప్రాయం చెబుతున్నారు.

వెంటనే కఠిన శిక్షలు అమలు చేయాలి

డాక్టర్ అనూష, ఇందిరానగర్ యుపిహెచ్‌సి వైద్యులు, మంగళగిరి

బెంగాల్ రాష్ట్రంలో ఆర్జికర్ హాస్పటల్లో మహిళా వైద్యురాలపై జరిగిన ఘటనపై మంగళగిరి పట్టణంలోని ఇందిరానగర్ యు పి హెచ్ సి డాక్టర్ పి అనూష మాట్లాడుతూ అలాంటి ఘటన లకు పాల్పడే వారిని వెంటనే కఠినమైన శిక్షలు వేసి అమలు చేయాలని అన్నారు. డాక్టర్లకు భద్రత లేకుండా పోతే, ఇక సామాన్య ప్రజల సంగతి ఏంటని ప్రశ్నించారు. అలాంటి వారిని సంఘటన జరిగిన 10 రోజుల్లో పై శిక్షలు కఠినంగా ఉండాలని అన్నారు. అలా అమలు చేస్తే భయం వస్తుందని ఆమె అన్నారు. ఇతర దేశాల్లో అలాంటి వారిని వెంటనే కఠినంగా శిక్షిస్తున్నారని అన్నారు. మన భారత దేశంలో కూడా అలాంటి శిక్షలు అమలు చేయాలని కోరారు.

ఆరోగ్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

డాక్టర్ బండ్ల శ్రీ ధరణి, కాస్మొటిక్ డెంటల్ సర్జన్, నరసరావుపేట

హాస్పిటల్స్ లో ముఖ్యంగా ప్రభుత్వ హాస్పిటల్స్ లో మహిళా వైద్యులు రాత్రిళ్ల కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహిళా వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి భద్రత కల్పించాలి. మహిళా పోలీసులను ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. హాస్పిటల్ కు అనుమానాస్పద వ్యక్తులు గాని, మత్తు పదార్థాలు సేవించిన వారు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు హాస్పిటల్స్ పై ప్రత్యేక నిఘా అవసరం. మహిళా వైద్యులకు, సిబ్బందికి ఆస్పత్రిలో పూర్తిగా రక్షణ కల్పించడం ద్వారా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

మనోధైర్యం దెబ్బతింటోంది

డాక్టర్ పువ్వాడ సాయి లక్ష్మీ, గైనకలాజిస్ట్, పువ్వాడ హాస్పిటల్, నరసరావుపేట

వైద్య ఆరోగ్య సిబ్బందిపై జరుగుతున్న దాడులు చూస్తుంటే మాలో మనోధైర్యం దెబ్బతింటోంది. సమాజంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం అహర్నిశలూ పనిచేసే మహిళా వైద్యులకు ప్రభుత్వాలు ప్రత్యేక భద్రత కల్పించాలి. కలకత్తా వంటి ఘటనలు పునరావత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన శిక్షలు తీసుకురావాలి. వైద్య సేవలు కోసం ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్‌కు మహిళలకు మెరుగైన వసతులతో పాటు రక్షణ కల్పించాలి.

ప్రాణదాతల్ని కాపాడుకోవాలి

డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు, మంగళగిరి

ప్రాణదాతలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ పిల్లల వైద్యం నిపుణులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ అన్నారు. బెంగాల్లో జరిగిన ఘటనపై అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. ఉన్న చట్టాలను కఠినంగా అమలు పరుస్తూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణం విచారణను పూర్తి చేసి కఠిన శిక్షలను అమలు చేయ వలసినదిగా విజ్ఞప్తి చేశారు. వైద్య రంగంలో చేస్తున్నా వారికి మానసిక స్థైర్యం కల్పించాల్సిందిగా ,ప్రాణ దాతలను కాపాడ వలసినదిగా, వైద్య రంగానికి రక్షణ కల్పించే దిశగా ప్రభుత్వాలు చట్టాలను అమలు పరచ వలసినదిగా కోరుతున్నట్లుగా తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా జరుగుతున్న ఇలాంటి ఘటన లను జరగకుండా ప్రభుత్వాలు చర్యలు కఠినంగా తీసుకోవాలని కోరారు.

సమాజంలో మార్పు రావాలి

డాక్టర్ సత్యకృష్ణ దీపిక దమ్మవళం, రాఘవేంద్ర మల్టీస్పెషాల్టీ హాస్పిటల్, కృష్ణా ఫీటల్ స్కాన్ సెంటర్, సరసరావుపేట

మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు రూపొందిస్తున్నా ఆచరణలో కనిపించడం లేదు. మంచి, చెడును అమ్మాయిలకే కాదు అబ్బాయిలకూ చెప్పాలి. అది మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. అంతిమంగా సమాజంలో మార్పు వస్తేనే అమ్మాయిలకు భద్రత సాధ్యం. ఆస్పత్రుల్లోనూ మహిళా సిబ్బందికి భద్రతతో పాటు సౌకర్యాలను కల్పించాలి. ప్రధాన ఆస్పత్రుల వద్ద రాత్రి వేళల్లో పోలీసులు ఉండే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

గుంటూరు జిల్లాలో నిరసన (ఫైల్‌ఫోటో)

డాక్టర్లకు, స్టాఫ్ నర్సులకు రక్షణ ఏర్పాటు చేయాలి

డాక్టర్ ఎన్ ప్రియాంక, మార్కండేయకాలనీ యుపిఎస్‌సి వైద్యులు, మంగళగిరి

ప్రభుత్వ ఆసుపత్రిలో రాత్రి సమయంలో పనిచేసే డాక్టర్లకు, స్టాఫ్ నర్స్ లకు రక్షణ ఏర్పాటు చేయాలని అన్నారు. అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. రక్షణకు ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడం లేకపోవడం వలన ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు పనిచేసే ప్రాంతాలలో భద్రతా చర్యలు కల్పించాలని కోరారు.